# పడవ

అపుకోలేని కన్నీళ్ళు ఇక ఆగని స్థితి వస్తే ఎలా పెల్లుబికి పోతాయో అలా ఏడుస్తోంది ఆకాశం.

ఏడుస్తుంటే ఊరడించేవారి మాటలు ఇంకా ఏడవటానికి ఉపక రించినట్టు వీస్తోంది గాలి.

అప్పుడప్పుడు ఆకాశం మెరుపుల ద్వారా వెలుగును కక్కుతోంది. 'ఇంత వానలో ఎక్కడికి వెళతారు, ఆగండి!' అని ప్రజలను శాసించి నట్టు మధ్యలో గట్టిగా ఉరుముతోంది.

ఎన్ని కష్టాలెదురైనా విసిగిపోక ముందుకు సాగిపోయే ధీరుడిలాగ అంత వర్షంలోనూ గమ్యానికి పరిగెడుతోంది ఆర్. టి. సి. బస్సు.

'ఈ వాన తగ్గేలా లేదు. నడపటం సాధ్యంగాక బస్సాపేరంటే ఇల్లు చేరుకునేసరికి ఆలస్యమైపోతుంది' అనుకున్నాడు స్వామి.

సముద్రాన్ని నమ్ముకుని, సముద్రం పక్కనే నివసించే ఒక కుటుంబంలో పుట్టాడు స్వామి. తండ్రి, తాత - అలాగే సముద్రాన్ని నమ్ముకుని, సముద్రం మధ్యకు పోయి చేపలు పట్టుకుని, అవి పట్నానికి తీసికెళ్ళి అమ్ముకుంటూ కాలాన్ని వెళ్ళబుచ్చేవారు.

'కులవృత్తికి సాటిలేదు గువ్వలచెన్నా!' పద్యం వాళ్ళెవరూ చదవ లేదు. కానీ కులవృత్తి తప్ప వారు మరే పనీ చెయ్యలేదు.

సముద్రంలో కెళ్ళేటపుడు ఊహ తెలిసిన మగపిల్లలను తీసి కెళ్ళటం వారి కలవాటు. నాలుగైదుసార్లు స్వామి కూడ వెళ్ళాడు తండ్రితో.

తండ్రి తెరచాప కట్టటం, చుక్కాని వేయటం చూసేవాడు స్వామి. తండ్రి గంగులు స్వామిని ఒకసారి పట్నం తీసికెళ్ళకపోతే స్వామి కూడ అలాగే పెరిగి పెద్దవాడయ్యే వాడేమో!

ఆరోజు—

స్వామి తన తండ్రితో పట్నం వెళ్ళిన రోజు-

పట్నంలో దొరబాబుల్ని, లాగూచొక్కా వేసుకుని బడికెళుతున్న తన వయసు పిల్లల్ని చూసిన రోజు-

"అయ్యా, నేను సదూకుంటా" అన్నాడు స్వామి.

"ఏటి, సదూకుంటా - నోర్మూయ్యేస్!" అంటూ కోప్పడిపోయాడు గంగులు.

నీరు తాగుదామని కోనేటి కెళ్ళినపుడు తోడేలుని చూసి వణికిపోయిన మేకపిల్లలా ఇంకేం మాట్టాడలేకపోయాడు స్వామి.

కాని—

గంగులు తోడేలు కాదు. స్వామికి శత్రువూ కాదు. ఇంటికొచ్చిన తరువాత కొడుకును చేరదీసి చెప్పాడు.

"సాములూ! ఆ సదూలు మనకస్సిరావురా!! ఆవూసు మరెత్తక!"

స్వామి మాట్టాడలేదు.

"బిడ్డ ముస్సటపడుతుంటే సదనీయరాదూ!" అంది స్వామితల్లి.

గంగులుకి చిర్రెత్తుకొచ్చింది- "ఆడంటే కుర్రనాయాల. నీకే మొస్సినాది రోగం? మా పెత్తల్లి కొడుకు ఈరిగాడు ఇసుకూలు కెడితే నేగా, నెల తిరక్కుండా పోయినాడు."

స్వామి చెవులకు ఆ మాటలు వినిపిస్తున్నాయి. కనులకు తల్లీ తండ్రీ కనిపిస్తున్నారు. కాని మనసుకు మాత్రం పుస్తకాలతో బడికి

పోతున్న తన వయసు పిల్లలే కనిపిస్తున్నారు. సూటు తొడుక్కుని ఠీవిగా నడిచే దొరబాబులే కనిపిస్తున్నారు.

"ఈడు సదుకున్నా సేసేదేముంది? సేపలు పట్టడమేగా! ఈడు సదూకుంటే ఈడి తమ్ముడు బిస్సపతిగాడూ సదూతానంటాడు. సదివించి నా కొడుకుల్ని సంపుకునేటంతటి తెలివిమాలినోన్ని కాదు. ఈపాలి సదూవూ సెత్తారంటే సెమడాల్తీసేత్తారు" అంటూ వలలు భుజానేసుకుని వెళ్ళిపోయాడు గంగులు.

స్వామి మరొకసారి పట్నం వెళ్ళినపుడు మాత్రం ఎలాగైనా చదువుకోవాలనీ, ఆ వాతావరణాన్నించి పారిపోయి ప్రయోజకుడు కావాలనీ కలిగిన ఊహను చంపుకోలేకపోయాడు.

ఫలితంగా—

ఒకనాటి రాత్రి పట్నం చేరుకుని కనిపించిన రైలెక్కాడు.

"వాన గట్టిగానే కురుస్తోంది. గాలి కూడ తక్కువగా ఏంలేదు. నాన్న సముద్రం మధ్యకు పోయాడో ఏమో!" ఇల్లు వదిలిన తర్వాత అలాటి గాలి, వాన చాలాసార్లు వచ్చినా, మొదటిసారిగా కలవరపడ్డాడు స్వామి.

బస్సాగిపోయింది. కాని.........

'పారిపోయిన నాటికి తనకు తొమ్మిదేళ్ళు. ఆ రైలు ఎంతవరకు పోతుందో అంతవరకూ పోయాడు. ఎవరూ తనను ప్రశ్నించలేదు. అయితే అప్పుడప్పుడు గుబురు మీసాలున్న మొహమొకటి కళ్ళజోడులోంచి చూస్తూండటం చూశాడు.

రైలాగింది. అందరూ దిగుతున్నారు. గుబురు మీసాలాయన దిగాడు. తనూ దిగాడు ఆయన తెల్లబట్టలాయన చేతిలో ఏదో పెట్టాడు. తను మామూలుగా వచ్చేస్తుంటే-

"టికెట్!" అన్నాడు తెల్లబట్టలాయన.

-దానిపై కొంత ఘర్షణయింది.

ఎంతో తెలుసుకుని, సొమ్ము చెల్లించి అడిగారు గుబురుమీసాలాయన. "బాబూ! మీదేవూరు?"

తనకి భయమేసింది. ఊరు కనుక్కొని ఇంటికి పంపేస్తారేమోనని. కాసేపుండి అడిగారాయన 'పోనీ మా యింటికి వస్తావా?'

అన్నం తిని, ఒకమూల పడుకుని నిద్రపోయాడు తను. సాయంత్రం రాఘవయ్యగారు పిలిచి, ఆదరంగా తల నిమిరినపుడు మాత్రం తన కథంతా చెప్పుకుని ఏడిచేశాడు.

'ఈమాత్రం దానికి ఏడవటమెందుకు? నువ్విక్కడే వుండి, మా గోపీతో కలసి చదువుకో!' అన్నారు రాఘవయ్యగారు. గోపీ రాఘవయ్యగారి చిన్నకొడుకు.

రాఘవయ్యగారు రాజకీయ నాయకుడు కాదు. వక్త కాదు. వేదాంతి కాదు. కానీ ఆయన మనసుకి నచ్చింది మాత్రం చేసి తీరుతారు, ఎన్ని అడ్డంకులొచ్చినాసరే- ఈ విషయం తను తర్వాత తెలుసుకున్నాడు.

తను స్కూల్‌ఫైనల్ పాసయిన రోజు-

రెడీమేడ్ దుస్తులు తీసుకున్నారు రాఘవయ్యగారు కట్టుకుని నమస్కరించాడు తను.

ఏదో మాట్లాడాలనే తపన. ఏమీ మాట్లాడలేని నిస్సహాయత. అప్రయత్నతంగా కళ్ళవెంట నీరు.

"బాబూ!" అన్నారాయన.

ప్రపంచంలోవున్న మాధుర్యమంతా ఆ రెండక్షరాలలోనూ చేరి తనను మరింత ఉక్కిరిబిక్కిరి చేసింది.

'బాబుగారూ మీరు చేసిన...' ఇక మాట్టాడలేకపోయాడు తను.

ఆప్యాయంగా తలనిమిరి, కాసేపు మౌనంగావుండి అడిగా రాయన.

'మీవాళ్ళని చూడాలనివుందా?'

తను కూడా కాస్సేపు మాట్లాడలేదు -

"నాకు మీ సహాయం దొరకకపోయిననాడు, ఇక్కడ ఏదైనా లోటు జరిగిననాడు, వారి గురించి తలచుకోవలసిన అవసరం వచ్చేదేమో! కానీ అలాటిదేమీ జరగనప్పుడు..." చెపుతున్నాడు తను.

ఆయన గర్వంగా చూస్తున్నారు. తన గురించి, తన వేషభాషల గురించి ఆయన ఎంత కృషిచేశారో తనకి, ఆయనకి మాత్రమే తెలుసు.

'రేపెళ్ళి అప్లికేషన్ తెచ్చుకో, కాలేజీలో చేరుదువుగాని'

'నాకిక చదువుకోవాలని లేదండి!'

"ఏం?" అడిగారాయన.

"ఆలస్యంగా చదువు మొదలుపెట్టానేమో - మరి చదువుకోవాలని పించటం లేదు" చెప్పాడు తను.

"మరేం చేస్తావ్?"

"ఇప్పట్లో ఇంటికెళ్ళాలని లేదు బాబూ! ఏదైనా ఉద్యోగం చేయాలనుకుంటున్నాను."

రాఘవయ్యగారి పలుకుబడి తనకు త్వరగానే ఉద్యోగాన్ని తెచ్చింది. తను ఉద్యోగంలో చేరి మూడేళ్ళు దాటి అన్నెల్లయింది. తన వారినీ, తన ఊరినీ చూడాలనే తపన బైలుదేరింది.

రాఘవయ్యగారికి చెప్పి ఆఫీసుకి సెలవుపెట్టి, ఇంట్లో అందరికీ మంచి బట్టలు తీసుకుని, మిగిలిన డబ్బు పట్టుకుని బస్సెక్కాడు-

ఆలోచనలతో ఉన్న స్వామికి బస్సు ప్రయాణించినట్టుకానీ, గమ్యం వచ్చినట్టుగానీ తెలియలేదు.

మధ్యలో వాన తగ్గింది. కానీ ఇంకా ముసురుగానే వుంది— చుట్టూ చూశాడు స్వామి-

పట్టణాలలో సౌకర్యాలు, వేషభాషలు కాలంతోబాటు పరిగెడుతుంటే తమ ప్రాంతం తన చిన్నపుడెలావుందో ఇప్పుడూ అలాగే వుంది.

స్వామి నడుస్తున్నాడు. ఇంత దూరంవచ్చి ముసురులో అరమైలు నడవటానికి స్వామి మనసు వెనుకాడలేదు

ఇల్లు దగ్గరవుతోంది. ముసురు వానగా మారుతోంది. పదేళ్ళ లోపునే తనా ఇల్లు వదిలినా ఆ ఇల్లు పరిసరాలు తనకు బాగా గుర్తు.

ఇల్లు లోపలికి పడుతున్నా తలుపు తీసేవుంది. తండ్రి చేపలు పట్టటానికి సముద్రం మధ్యకు వెళ్ళాడన్నమాట! ఇంత వానలో కూడ ఆ తలుపులు తీసున్నాయంటే అదే అర్థం.

స్వామి మనసు కలవరపడింది. ఇంట్లో అడుగుపెట్టి ఒకసారి పరికించి చూశాడు.

'ఎవరోరు?'

అమ్మ! తనని గుర్తించలేదు. వయస్సు తెచ్చిన మార్పు తప్ప మరే మార్పులేని అమ్మ!

"ఎవరోరంటే మాటాడరేం?" మళ్ళీ అడిగింది.

"ఎవరో దొరబాబులాగున్నాడు. వానతగ్గేక ఎల్లిపోతాడులే!" ఇంకో గదిలోంచి వచ్చిన తండ్రి అన్నాడు.

"తండ్రి ఇంట్లోనే వున్నాడు. అమ్మయ్య!"

తండ్రి కూడ తనని గుర్తించలేదు.

"అమ్మా!" పరుగున వెళ్ళి తల్లి పాదాలను చుట్టేసుకున్నాడు స్వామి. తల్లి ఆశ్చర్యపోయింది.

"ఇదేటి?" గంగులాశ్చర్యపోయాడు.

"అమ్మా! నేను - స్వామిని!"

"సాములా!"

వాళ్ళు ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోలేదు.

"అవును. నేనే! ఆరోజు చదువుకుంటానంటే వద్దన్నారని పారిపోయి చదువుకున్నాను. నాన్నా! నాకిప్పుడు జీతమెంతో తెలుసా - రెండు వందల ఎనభై రూపాయలు."

"ఏటి - నెలకే!"

తల్లి స్వామిని బదులు చెప్పనీయకుండా వెలుగులోకి లాక్కెళ్ళి కుడిచేతిని చూసింది.

"ఈడు సాములే! కావాలంటే సేతిమీద సీకఃష్టుని పస్సబొట్టు సూస్కో!" తల్లి మొహంలో అంత ఆనందాన్ని స్వామెప్పుడూ చూళ్ళేదు. ఆ ఆనందంతో పోల్చదగిన ఆనందం సృష్టిలో మరేం లేదేమో!

"సాములు కాక, ఎవుడో అయితేమాత్తరం అబద్దాలు సెప్పి, ఇక్కడాడు అట్టుకెల్లేదేముందే- నాలుగు వొలలు తప్ప! ఆడు సాములేలే, నాకు తెల్సు!" అన్నాడు గంగులు.

తల్లి దగ్గర తువ్వాలు తీసుకుని తల తుడుచుకున్నాడు స్వామి. తను తెచ్చిన వస్తువులు తల్లితండ్రుల కివ్వాలనే ఆతృత పెరిగి, దాని నణుచుకోలేక తన పెట్టె తీయబోయాడు -

"ఒరే సాములూ! నువ్వు నాకు కొడుకువూ గావు, నాన్నీకు అయ్యనీ గాను. పో ఇక్కన్నించి!" తండ్రి మాటలు వినిపించాయి.

"సాన్నెద్దూ సంబతం. ఇన్నాల్లకాడు పెయోజకుడై గుడిసెకొత్తే అన్ని పొమ్మంటా వేటి?" స్వామి తల్లి అడిగింది.

"సదూసంజలు మన కస్సిరావురా అంటే ఇనుకున్నాడా? సదివాడు. ఈడు బాగానే వున్నాడు. ఈడిబదులు ఆ బిస్సపతిగాన్ని పొట్టనెట్టుకునుంటాడు బగమంతుడు" గంగులన్నాడు కోపంగా.

"బిక్షపతికేమైంది?" ఆత్రంగా అడిగాడు స్వామి.

"ఆడికేటైందనిప్పుడు? మరీ ఇద్దూరం నెద్దూ నీది? రోజులు, వారాలు సముద్రంలో వుండిపోవటం మనోల్ల కలవాటేగా!"

"నోర్ముయ్యేస్! ఈగాలి, ఈదరంలో ఆడేడ సిక్కడి పోనాడో ఏటో! దానికి సాయం ఈడు సదూకొచ్చాడు. సచ్చినా పీడాపోను!"

స్వామి మనసు బాధగా మూల్గింది.

ఎవరూ మాట్లాడలేదు.

ఇంతలో అడుగుపెట్టాడు బిక్షపతి.

"అడుగో బిస్సపతి వచ్చేసినోడు!" ఆమె ఆనందానికి మేరలేదు. స్వామి సంగతి సరేసరి!

గంగులు మాట్లాడలేదు. కాదు, మాట్లాడలేక పోయాడు. బూజు పట్టిన భావాలు ఉగ్గుపాలగా తాగిన మనిషి గంగులు. కొడుకు తిరిగివచ్చినందుకు ఆనందంగానూ వుంది, అయోమయంగానూ వుంది.

బిక్షపతిని ఆనందంగా కౌగలించుకున్నాడు స్వామి. అన్నగారిని అలా చూస్తూ వుండిపోయాడు బిక్షపతి.

ఆ మర్నాడు

వాన తగ్గింది. స్వామిని చూట్టానికి గూడెంలోని జనం వచ్చి పోతున్నారు.

"నెల్రోజులుంటావేటి," అడిగాడు గూడెం పెద్ద సీరాములు.

"ఉంటానండి. మనవాళ్ళ సంపరినీ చూద్దామని సెలవుపెట్టి వచ్చాను" చెప్పాడు స్వామి.

"ఏం ఇనయం, ఏం ఇనయం! ఈడి తస్సాదియ్యా, సాములు మా సెద్ద బుద్ధిమంతుడై పోనాడు!!" సంబరపడ్డాడు సీరాములు.

"సదూవొల్లే ఆడికా ఇనయమబ్బింది. మన నర్సిమ్ముల్ని కూడా సదివిద్దారి" అంది సీరాములి భార్య.

"సాల్లేవే! పులిని చూసి - నక్క వాతెట్టుగున్నాదంట!"

"అలాకాదు. తప్పకుండా చదివించండి" చెప్పాడు స్వామి.

"సూదార్లే!" అంటూ వెళ్ళిపోయాడు సీరాములు భార్యతోసహా.

ఎవరో ఒకరు రావటం, ఎలా పారిపోయాడో, ఎక్కడున్నాడో, ఎలా చదివాడో - అన్నీ అడగటం, వెళ్ళటం.

ఇరవై రోజులు గడిచిపోయాయి.

ఒక రోజున——

స్వామి పేరున టెలిగ్రాం. పక్క ఊరికొచ్చిన నాలుగు గంటలకు మెసెంజరు దానిని తీసుకొచ్చాడు.

చదివాడు స్వామి -

భూమి విడిపోతున్నట్టు, ఆకాశం కింద పడుతున్నట్టు అనిపించింది. కానీ అవలాగే వున్నాయి. రాఘవయ్యగారు మాత్రం పోయారు.

ఆత్రంగా డేటు ముద్ర చూశాడు స్వామి. రెండ్రోజులక్రితం ఇచ్చిన టెలిగ్రాం అది.

"రాఘవయ్యగారు, మా బాబుగారు చచ్చిపోయారు." తల్లికి,

తండ్రికి టెలిగ్రాం అనగానే చుట్టూచేరిన గూడెంలోనివారికి ఒక్కటే మాట చెప్పి అవాక్కయిపోయాడు స్వామి.

ఒక్కొక్కరే వెళ్ళాం తర్వాత తల్లి స్వామిని పూరడించింది. "ఆయన మంసోడ్రా, మంసొల్లెక్కువకాలం బతికర్రా! ఆ బగమంతడికి అల్లంటేనే ఇట్టం!"

నిజమే ననిపించింది స్వామికి.

మొదటి రోజుల్లో తాను భోజనానికీ దానికీ సిగ్గుపడుతున్నపుడు ఆయన చెప్పిన మాటలు, ఆయన అస్తమానూ చెబుతుండే మాటలు. తను జీవితాంతం గుర్తుంచుకోదగిన మాటలు, గుర్తుంచుకోవలసిన మాటలు — గుర్తొస్తాయి స్వామికి.

"బాబూ! పడవ గురించి నీకు బాగా తెల్సుంటుంది. పడవ నీటిలో వుంటుంది. అవునా! పడవ నీటిలో ఉన్నంతవరకు పరవాలేదు. కానీ పడవలోకి నీళ్లొస్తే— పడవ మునిగిపోతుంది.

అలాగే ఒక కులంలో మనిషి పుట్టవచ్చు. కాని మనిషిలో మటుకు కులం తాలూకు వాసనలుంటే అతని మనుగడే ఆగిపోతుంది. ఒక వేళ బతికినా అతను మనిషిలా మాత్రం బతకలేడు."

ఆలోచనతో ఉన్న స్వామికి తండ్రి గొంతు గట్టిగా వినిపించింది. ఆ తర్వాత ఆ గొంతు తన గురించే గట్టిగా మోగుతోందని తెలియటానికి ఎంతోసేపు పట్టలేదతనికి. అతను తెలుసుకునే సరికే అతని పెట్టె వీధిలో విసిరివేయబడివుంది.

"పోరా సిగ్గులేని నమ్మికొడకా. ఏడకి పోతావో పో! అన్నం ఎట్టిన సేతినే నరికేసిన ఎదవ్వి నువ్వు. ఆ పున్నెత్ముడు నీకు తిండి ఇచ్చి, గుడ్డలిచ్చి, ఇంతోణ్ణిసేత్తే- సూశావా నీ సదూ అయనగారి కొంపకే ఎసరెట్టింది. నువ్విడుంటే మాక్కూడా అరిట్టం. ఎళ్లెల్రా ఎదవసన్నాసి!"

గుడిసెపైకెట్టెకొచ్చి పెట్టేసుకుని నెమ్మదిగా నడుస్తున్న స్వామి ఆలోచనలో పడ్డాడు-

'మనుషులలో మూఢనమ్మకాలకు తగినట్టుగానే జీవితంలో సంఘటనలు జరుగుతాయా? లేకపోతే ఏం జరిగినా, మనుషులు ఆ జరిగిన వాటిని తమ నమ్మకాల కనుగుణంగా మలచుకుంటారా?'

ఎంతకీ ఆలోచన తెగలేదు స్వామికి.

'ఏది ఏమైనా - తను రాఘవయ్యగారి అడుగుజాడల్లో నడిస్తే చాలు!' అనుకున్నాడతను. అలా అనుకున్నాక వడివడిగా అడుగులేస్తూ పట్నంకేసి నడిచాడతను.